# ఫర్ సేల్

ఇచ్ఛాపురపు రామచంద్రం

సిగరెట్ చివరి పీల్చుని గాఢంగా తీసుకుని ఒకటి రెండుక్షణాలు పొగని లోపల నిలుపుకుని అప్పుడువిలాసంగా మెల్లగా పొగని వదులుతూ అటు చూశాడు రాజేంద్ర.

రోడ్డు కవతల....

అద్దాలతో కట్టి నట్లున్న షాపు. ఆ అద్దాల వెనుక—రంగు రంగుల చీరెల మడతల్లా రకరకాల అట్టల—బొమ్మల పుస్తకాలు. వాటివెనుక ఎవరుంటారో అతనికి తెలుసు.

సుధ ! ఎంత చక్కని అమ్మాయి ! సున్నితంగా మాట్లాడుతుంది. స్నిగ్ధంగా నవ్వుతుంది. సుకుమారంగా ఉంటుంది. నాజూకుగా ప్రవర్తిస్తుంది. ప్రత్యేకమయిన అమ్మాయి సుధ. అందుకే కదా రెండు నెలలనుంచీ తన ఆలోచనలనీ కలలనీ ధ్యాసనీ ఆమె మీదే నిలుపుకున్నాడు. సుధ మామూలు సేల్స్ గర్ల్ కాదు. అందరిలాటి అమ్మకాల అమ్మాయికాదు. అలాగే ఐతే ఆమె గురించి తను యింత టైము తీసుకునే ఆవసరమూ, అగత్యమూ ఉండేవే కాదు. నిజంగా సుధ ఓ తీయని బాధ. తీరని వ్యధ. ఈ రెండు నెలలనుంచీ ఆమె గురించి తను పడుతున్న శ్రమ, తీసుకుంటున్న శ్రద్ధా తక్కువేమీ కావు.

ఆవేళ....యిదే రోడ్డుమీద నడుస్తుంటే—అన్‌వాంటెడ్ గెస్టులా వాన. కొత్తబట్టలని వర్షానికి బలిచెయ్యలేక చటుక్కున బుక్‌స్టాలులోకి నడిచాడు.

ద్వారం దాటి యింకా లోపలికి వెళ్ళకుండానే—

"రండి—" కోకిల కంఠంలోంచి స్వాగతం. మధురమయిన స్వరం.

ఆమెవేపు చూసి చిరునవ్వు నవ్వాడు.

"కృతజ్ఞతలు—"

ఆమె ఏమీ అనలేదు. కుర్చీచూపితే దానిలో కూర్చున్నాడు.

అవతల వానల్లా వర్షమైంది.

తను పుస్తకాలు చూడసాగాడు. నిజానికి తననవి ఏ మాత్రమూ ఆకర్షించడంలేదు. తన దృష్టంతా సుధ మీదే. పుస్తకాల అట్టల మీద అమ్మాయి బొమ్మలకంటె వెయ్యి రెట్లు అందంగా ఉంది—సుధ.

కాయ్యబొమ్మల మెచ్చు కనులకు కోమలుల సౌరెక్కునా అన్నాడు వెనుకటి కొక కవి. తన మిత్రుడు తరచుగా ఆ పద్యం పాడేవాడు. మిగిలిన వాళ్ళ సంగతేమోకాని తనకి మాత్రం కోమలుల సౌరే ఎక్కుతుందికాని సాహిత్యమూ చిత్రాలూ శిల్పాలూ యిటువంటివి మనసుకి పట్టవు. స్త్రీ యే ఒరిజినల్. ఆర్టంతా డూప్లికేటే. మూలం ఉండగా అనుకరణలు పట్టుకు వేలాడ్డం అవివేకమే.

"మీకెటువంటి తరహా పుస్తకాలు కావాలో చెబితే—నేను, మీకు సహాయ పడగలనేమో ప్రయత్నిస్తాను." వచ్చింది సుధ బుక్‌రాక్ దగ్గరకి.

"థాంక్స్—" కంగారుగా అన్నాడు. తన మనసులోని మాట ఆమెకెలా చెప్పగలడు యింత త్వరగా ? చెబితే-పరిణామం ఏమీ బాగుండదు. ఏ పనికీ తొందర కూడదని కదా ఆర్యోక్తి ? అందులోనూ, అందమైన అమ్మాయిల విషయంలో తొందరనేది అసలు పనికి రాదు.

సుధ—నవ్వింది. "మీకు నిశ్చయంగా ఓ అభిప్రాయమంటూ లేనట్లుంది ?"

"ఊఁ...." కంగారు పడ్డాడు.

"కొందరు-ఫిక్షన్ కావాలంటారు. కొందరు హిస్టారికల్....కొందరు—ఫిలాసఫీ..... అలాగ. నిజానికి ఎక్కువమంది అడిగేది...." ఆగిపోయింది.

"ఏమిటి ?" ఆత్రంగా అడిగాడు.

"సెక్స్ పుస్తకాలు." నిరాసక్తంగా అంది సుధ.

సహజమే. అనుకున్నాడు. కాని—అతనికి వెంటనే తేలిపోవడం యిష్టంలేదు. సుధను చూసిన తొలిక్షణంలోనే అనిపించింది—దీర్ఘకాలిక ప్రణాళిక వేస్తే తప్ప యీ సుందరిని వలపువలలోకి ఆకర్షించడం అసాధ్యమని.

"మీకు నచ్చిన పుస్తకం సిఫార్సు చెయ్యండి."

ఆమె కొంచెం ఆలోచించి—రాక్‌లోంచి ఒక పుస్తకం బయటకుతీసి—

"ఇది చూడండి." అంది.

"నేను చూడక్కర్లేదు—మీరు చెప్పాక." నవ్వాడు.

"బిల్ వ్రాయమంటారా ?"

"ఊఁ"

పుస్తకం ఆమె చేతిలోంచి అందుకుంటూ ఆమె వేళ్ళను తాకాడు.

అద్భుతమయిన నరాలలోంచి ఒక్కసారి విద్యుత్ ప్రవహించినట్లు అనుభూతి.

ఆమె బిల్లు అందించింది. పద్దెనిమిదిరూపాయలు.

అతనికి చీమకుట్టినట్లయినా అనిపించలేదు. చాలా నిర్లక్ష్యంగా జేబులోంచి రెండుపదులుతీసి అందించాడు. చిరునవ్వుతో స్వీకరించింది సుధ

"వర్షంతగ్గేవరకూ ఉండి వెళ్ళకూడదూ?"

"అలాగే థాంక్స్."

ఆమె ఫ్లాస్కులోంచి టీపోసింది కప్పులోకి

"మీరు కస్టమర్స్‌కి టీ యిస్తుంటారా?"

"ఉహుఁ. మీకు మాత్రమే ఇది. నాకోసం తెచ్చుకున్న టీ."

"మీకు చాలా కృతజ్ఞతలు మిస్....?"

"సుధ" అప్రయత్నంగా అందామె.

"నా పేరు రాజేంద్ర. చూడండి సుధా. మీ ఔదార్యం మంచిదేకాని, నేను చాలా స్వార్థపరుడ్నికాను. సాసర్లో మీరూ, కప్పులో నేనూ టీ పంచుకుందాం. ఏం ?"

ఇవన్నీ చూసి కొందరు కొనుగోలుదార్లు భ్రమపడతారు సేల్స్ గర్ల్స్ తమని ప్రేమించేస్తూందేమో అని. వాళ్ళకేం తెలుసు ? జీవితం చాలా క్లిష్టమని అదీకాక వారి భ్రమలకీ కారణం లేకపోలేదు. నర్సులన్నా, సేల్స్ గర్ల్సన్నా మనవాళ్ళకిచాలావరకి ఓదురభిప్రాయం ఏర్పడిపోయింది



నరముల బలహీనత, గుప్త రోగములకు
ఉత్తమ చికిత్స!
పెండ్లి ముందు, పెండ్లి తర్వాత
సంప్రదించండి :



(Govt. Regd.)
Dr. Z. H. ROY
Dr. K. Kesava Rao
(Govt. Regd)
ఆసియా క్లినిక్
ఆర్. టి. సి. క్రాస్‌రోడ్,
సంధ్యాటాకీస్ ఎదుట,
హైద్రాబాద్—500020.
కృష్ణాటాకీస్‌వద్ద, కడప—1



## వరకట్నంలేని పెళ్ళి

వరకట్నానికి అమ్ముడుపోయే వరుని కొన డానికి సొమ్ములేని నిస్సహాయ కన్యాదాతలకు డాక్టర్ (శ్రీమతి) అశ్వినీలాల్‌గారి కానుకలు

"కట్నంలేకుండా పెళ్ళి చేయడమెలా ?" రు. 15/—

"పెళ్ళిచూపులు ఏర్పాటుచేయడమెలా ?" రు. 15/—

(పెళ్ళి చూపుల ఏర్పాట్లలో వధువు తలిదండ్రులు చేసే పొరపాట్లు, వాటిని సరిదిద్దుకోడానికి సూచనలు)

పుస్తకం ఖరీదు M. O. చేయండి. ప్రతులకు శ్రీవిజయలక్ష్మి పబ్లికేషన్స్, ప్లాటు నెం. 91, నూకీనల్లకుంట, హైదరాబాదు—500044. (సి.ఎ. 816)


కాదనలేదామె.

"వర్షంపడుతూంటే టీ తాగుతూ గ్లాస్ పానల్స్‌లోంచి రోడ్డుని చూస్తూంటే తమాషాగా ఉంటుంది నాకు."

"నాకూను." అందామె.

"ఓహ్ ! మన అభిరుచులు.... అదే.... సరదాలు.... ఒక్కటే !"

ఆమె స్నిగ్ధంగా నవ్వి ఊరుకుంది.

వర్షం వెలిసిపోయింది క్రూరంగా.

"ఈ షాపులో మీరొక్కరే ఉంటారా సుధా ?"

"ఊఁ. నామమాత్రంగా సహాయకుడుంటాడు. వాడు యిక్కడ ఉండకుండా నాకెక్కువ సాయపడుతూంటాడు !"

"ఒక్కరికీ విసుగెయ్యదూ ?"

"పుస్తకాలని మించిన మంచి మిత్రులు మరెవరు ? ఈ పుస్తకాలు నా జీవితం."

"అచ్చంగా పుస్తకాలలోలాగమాట్లాడారు!" చిలిపిగా చూశాడు.

ఎవరో వస్తున్నట్లయింది. అతనువెడుతూ- "మళ్ళీ.... ఎల్లుండి.... శుక్రవారం వస్తాను." అని బయటకు నడిచాడు.

అతనికి తెలుసు. ఆమాట సుధమీద తక్కువ ప్రభావం చూపదని. అదొక టెక్నిక్. అతని ధ్యేయం సుధ ఆలోచనలలో తను మెల్లగా చోటు సంపాదించుకోడం. క్యామిల్స్ హెడ్ యిన్ ద టెన్ట్ అదీ స్ట్రాటజీ.

శుక్రవారం రోడ్డుమీద నిలుచుని అవతలి వేపు ఉన్న షాపుని తదేకంగా చూడసాగాడు సిగరెట్ పీలుస్తూ. షాపులో సుధ తప్ప మరెవరూ లేరని నిర్ధారణగా అనిపించాక- షాపులోకి నడిచాడు.

చిరునవ్వుతో ఆహ్వానించింది సుధ. "పుస్తకం నచ్చిందా ? ఎలా ఉంది ?"



## నిజాలు

"ఏరా శంకరం! మా ఆవిడకి నా గురించి అన్నీ అబద్ధాలే చెప్పావట!" అడిగాడు మూర్తి కోపంగా.

"సంతోషించు .... నిజాలు చెబితే నీ కాపురం ఎప్పుడో కూలిపోయేది!" అన్నాడు శంకరం.

—ఎమ్. విమలాదేవి (విజయవాడ)

"నైస్. స్ప్లెండిడ్ ...." జవాబుగాఅన్నాడు. "ఈసారి పుస్తకం యిచ్చేముందు సరిగ్గా అలాటిదే యిస్తారు కదూ?"

"ష్యూర్"

ఆవేళ ప్రేమ వ్యూహంలోకి మరికొంత చొచ్చుకువెళ్ళగలిగాననుకున్నాడు.

సుధ షాపుకి ఎన్ని గంటలకువచ్చేదీ, ఎన్ని గంటలకు వెళ్ళేదీ విశ్రాంతి సమయమూ అటువంటి వివరాలు.

ఏదో సందర్భంలోఅంది సుధ. "మనవాళ్ళు చీరలకైతేనో, సినిమాలకైతేనో ఖర్చుపెట్టడానికి వెనుకాడరు. కానీ పుస్తకాలవిషయంలో వాళ్ళ తత్వంవేరు. చదివేవాళ్ళు కూడా అరువో అద్దెకో తెచ్చుకుందామనుకుంటారు. చిరిగిన చొక్కాతో అయినా ఉండుకానీ మంచిపుస్తకం దొరికితే కొనడం మానకన్న సువర్ణసూక్తి మనవాళ్ళకి నర్తించదు."

"నిజమే. పుస్తకాల విలువ తెలిసినవాళ్ళెందరు ?"

సంపెంగపూవులాటి సుధ.... ఆమె సమక్షంలో కాలం ఎంతత్వరగా పరుగెడుతుందని!

"ఈసారి మీకు ఓ పుస్తకం యిస్తాను. నిజానికది సెకండ్‌హాండ్. రాపర్‌మీద ఇనీషియల్స్ లేకపోతే కొత్తదేఅనుకుంటారు. చాలా విలువైన అరుదైన పుస్తకం. అతను ఎంత బాధపడ్డాడో తిరిగి అమ్మవలసి వచ్చినందుకు"

కొంచెం అసూయ అతని కంఠంలో "ఎవరతను !"

"మంచి పాఠకుడు, ఆ వయసులో అంత ఏకాగ్రతతో పుస్తకాలు కొని చదవడం...."

"ఎంత వయసు ?" ఆత్రత.




ఫిలిప్స్
HIFI International
అపస్వరంలేని సంగీతానుభూతికి....
రేడియో టేప్‌డెక్ సాకెట్లతో
డీలర్లు: స్టోనో విజన్
ఏలూరురోడ్డు, విజయవాడ—2.
(SUVARNA)



## కలకాలం

"మన ప్రేమ కలకాలం ఇలా నిలిచి పోవడానికి మనం ఏం చెయ్యాలి రమేష్?" అడిగింది రమ.

"మనం పెళ్ళి చేసుకోకూడదు" చెప్పాడు రమేష్.

—డి. జ్యోతి. (సిర్పూర్ కాగజ్‌నగర్)

"కనీసం నలభై ఐదు. సుమారు ఏభై. పుస్తక పఠనానికి వయసుతో అట్టే నిమిత్తం ఉండదు."

"ఔను" అతను చల్లబడ్డాడు. కస్టమర్స్ రాగా విధిలేక, సుధని వదలలేకవెళ్తూ "మంగళ వారం.... వస్తాను." అన్నాడు. అతను పుస్తకం మరచిపోయివెళ్ళిపోతూంటే ఆమెఅందించింది వేళ్ళ స్పర్శ.

ఈ మంగళ-శుక్రవారాల ఆట ఒకటి రెండు నెలలు సాగింది.

ఒకసారి అతనన్నాడు "మీకు నేను టీ బాకీ పడ్డాను సుధా. మీ బాకీ చెల్లించుకునే అవకాశం ఇప్పించరూ?"

ఆమె నవ్వేసి "మనలోమనకి బాకీలేమిటి?" అంది.

అతను పొంగిపోయాడు. ఇక ఈ ఖరీదయిన నాటకానికి త్వరలో ముగింపు తేవాలి. ఇప్పటికే పుస్తకాల పేరిట తను చాలా వ్యర్థం చేశాడు- కాలమూ, ధనమూ.

* * *

"సుధా."

ఏదో వ్రాసుకుంటున్న ఆమె-సీరియస్‌గా తలెత్తి చూసి చిరునవ్వు నవ్వుతూ "రండి" అంది కుర్చీలోంచి లేస్తూ. నిశ్చయంగా అది కమర్షియల్ స్మైల్ కాదనీ, ఆ మందహాసం తనకే ప్రత్యేకమనీ అనుకున్నాడతను.

"ఇవాళ నేను పుస్తకం కోసం రాలేదు" నవ్వాడు.

"మరి?" ఆమె కూడా నవ్వింది.

"చెప్పండి. మీకే హోటల్లో డిన్నర్ ఇష్టం? మేరీస్? ఓపాపా?"

"ఏదయినా ఒకటే"

"ఏ థియేటర్? సఫయిరా, దేవీయా?"

"...." ఆమె ఒక్కసారి అతన్ని చూసి తలదించుకుంది.

"సవేరాలో రూమ్ తీసుకుందామా? తాజ్ కోరమండలా?"

"దేనికీ?"

"సరదాగా గడిపేందుకు. రేపెలాగూ మీకు శలవేగా? సాటర్‌డే యీవెనింగ్ ఫీవర్ సినిమా చూసి, డిన్నర్ తీసుకుని సరదాగా గడుపుదాం"

"సరదా కోసం మీరు వేసిన ప్రోగ్రామ్ చాలా ఖరీదైనదనుకుంటాను"

"డబ్బుదేముంది?" తేలిగ్గా అన్నాడు. అనుభూతులూ అనుభవాలు ముఖ్యం".

"నిజమే చూడండి రాజేంద్రా....దయచేసి మీరొకసారి రేపు మా ఇంటికి రాకూడదూ? ప్లీజ్"


ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★ 100% పాలియస్టర్ చీరలు
★ ఫుల్‌వాయిల్, ఆఫ్ వాయిల్ చీరలు
★ షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★ డ్రస్ మెటీరియల్సు, 2x2 రూబియాలాన్సు
★ స్కూలు యూనిఫారంలు ... వగైరాలకు
విజయ షోరూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షోరూమ్
జి.హెచ్. హాస్పటల్ రోడ్డు,
గవర్నరుపేట ..... విజయవాడ-2.

వివాహాది శుభ కార్యములకు-
విందు భోజనములకు,
ప్రతి నిత్యము మీ ఇంటి వాడుకకు.
నమ్మకమైన
పాత బియ్యం
పరిశుభ్రముగా బాగు చేయబడినది.
శ్రీ విజయ రైస్ కంపెనీ
గవర్నరుపేట :: విజయవాడ-2
ఫోను చేసిన వెంటనే హోమ్‌డెలివరీ చేయబడును
ఫోన్: 73704
SUVARNA

డా॥ పి. వి. కె. రావ్, B.A.
వైద్యవిద్వాన్ వైద్యాచార్య, సెక్సు స్పెషలిస్టు
వివాహము వాయిదా వేయనవసరములేదు





హస్తప్రయోగం, నరముల బలహీనత, శీఘ్రస్ఖలన ములకు ఆయుర్వేద చికిత్స పోసుద్వారా చికిత్స కలదు.
రావూస్ క్లినిక్.
టక్కగోడి 10 01.
ఫోన : 700. —తెనాలి






గోల్డన్ జర్దా
స్వచ్ఛమైన, మంచి సువాసనగల పొగాకుతో ఆరోగ్యప్రదంగా మిశ్రమంచేసి తయారుచేయబడినది.
నిర్మాత: శ్రీ బాలాజీ ప్రాడక్ట్స్
జనరల్ బజార్, సికింద్రాబాద్-3 ఫోన్లు: ఆఫీసు: 76404; ఫాక్టరీ: 74975

అతని ముఖం వికసించింది. కాగలకార్యం గంధర్వులు తీర్చారన్నట్లు సుధ అతి తక్కువ ఖర్చుతోనే అన్నీ అమర్చుతానంటూంది. తనకి మరీ మంచిది.

"మీరు ఆహ్వానించాక రాననగలనా, ఇంత స్నేహం అనంతరం?"

"మీకు చాలా కృతజ్ఞతలు".

"దేనికీ?"

"నా ఆహ్వానాన్ని మన్నించినందుకు".

"బలేవారు! ఆహ్వానించినందుకు మీకు నేనే నా కృతజ్ఞతలు తెలుపుకోవాలి. ఐనా. మనలో మనకి కృతజ్ఞతలేమిటి?"

"నిజమే" అంది సుధ.

"రేపు తొమ్మిది గంటల ప్రాంతంలో వస్తాను. మీకు అసౌకర్యం కాదు కద?"

"అసౌకర్యమా! ఉహుఁ ఆనందం. ఉదయం ఎనిమిది నుంచీ మీ కోసం నిరీక్షణే".

"థాంక్యూ".

పుస్తకాలు కొనుక్కుందుకు (చూసేందుకా?) అరడజనుమంది గుంపుగా వచ్చేసరికి రాజేంద్ర ఆమె వద్ద శలవు తీసుకుని వచ్చేశాడు.

* * *

ఉదయం తొమ్మిది గంటలు.

మాంబళంలో చిన్న ఇంటిముందు డోర్ నంబరు సరిచూసుకుంటున్నాడు రాజేంద్ర. చివరకతను తలుపు తట్టాడు.

"ఎవరు కావాలి?"

"సుధ.... బుక్ స్టాల్...."

"ఐతే మీరు రాజేంద్ర!.... నేను కరెక్ట్‌గానే చెప్పానా?"

"ఊఁ" నీరసంగా మూలిగాడు.

"రండి, సుధ మీ కోసమే చూస్తోంది, సుధా!.... రాజేంద్ర వచ్చారు".

లోపలినుంచి వచ్చింది సుధ కాఫీలతో.

కాఫీలు తీసుకుంటూండగానే పరిచయం చేసింది. "వీరు మా వారు రఘురాం, మీకు రాజేంద్ర గురించి చెప్పానుగా?"

"ఔను మంచి కస్టమర్ అని".

రాజేంద్రకి పచ్చి వెలక్కాయి గొంతుకడ్డం పడినట్టుంది. కారణం-సుధ. ఆమె రూపంలో ఎంత మార్పు! షాపులో కనిపించే సుధకీ.... ఇంటి దగ్గరి సుధకీ ఎంత తేడా!

తన హృదయంలోని ఆలోచనను పసికట్టినట్లే చెప్పింది సుధ.

"రఘూ! నీకు తెలుసుగా నేను చేసే ఉద్యోగం ఎటువంటిదో? అందంగా కనిపించాలి! సౌమ్యంగా మాట్లాడాలి. చిరునవ్వే తప్ప చిరాకు ప్రదర్శించకూడదు. ఈ నటనంతా తప్పదు. అన్నట్లు అలంకరణ. ఎదుటి వారిని ఆకర్షించేటట్లుగా అందంగా తయారవాలి. మేకప్ అదే పౌడరూ, క్రీమూ చెరిగిపోకుండా మాటిమాటికీ చూసుకుంటూ సరిచేసుకోవాలి.

ఇవన్నీ చూసి కొందరు కొనుగోలు దార్లు భ్రమపడతారు- సేల్స్‌గర్ల్ తమని ప్రేమించేస్తుందేమో అని, వాళ్ళకేం తెలుసు? జీవితం చాలా క్లిష్టమని. అదీకాక వారి భ్రమలకీ కారణం లేకపోలేదు. నర్సులన్నా, సేల్స్‌గర్ల్సన్నా మనవాళ్ళకి చాలామందికి ఓ దురభిప్రాయం ఏర్పడిపోయింది. అమ్మకాల అమ్మాయిలు– తమ శరీరాలను కూడా అమ్ముకుంటారని. కథల్లోనూ సినిమాల్లోనూ యిలా చూపుతూంటారు కదా?"

"ఇప్పుడిదంతా దేనికి సుధా?" అడిగాడు రఘురాం సుధని చూస్తూ.

"ఈ మిత్రులు– రాజేంద్ర– అటువంటి కోవలోకి చేరరని చెప్పడానికి. వీరు నిజంగా స్నేహితులు. మీరది గుర్తించీ విశ్వసించీ యివాళ మంచి కంపెనీ యివ్వగలరని. వీరికి నా ఎన్నిక మీద మంచి గురి. ఏం రాజేంద్రా, నేను సూచించి కొనిపించిన పుస్తకాలు మీకు నచ్చాయి కదూ?"

"ఊఁ" నూతిలోంచి వచ్చినట్లుందతని గొంతుక.

"మీరూ రఘురాం కొంచెం సేపు కబుర్లు చెప్పుకుంటూండండి. ఈలోగా వంట పూర్తి చేసేస్తాను. అన్నట్లు– రాజేంద్రా.... మీకు కిచిడీ యిష్టమా, పాయసమా? టేబులు మీద తింటారా, పీటమీదా? తమిళ భోజనమా, తెలుగు భోజనమా?"

"చూడండి... మీరు నన్ను క్షమించాలి."

"దేనికి?" అతని ముఖంలోకి సూటిగా చూసింది సుధ.

"ఇవాళ నాకు చాలా ముఖ్యమైన పనుంది. భోజనానికుండలేను. అది చెప్పాలనే వచ్చాను"



## ప్చ్...

సుబ్బారావు రోడ్డుమీద పరధ్యానంగా నడుస్తున్నాడు.


ఓ స్కూటర్ అతన్ని గుద్దేసింది.

స్కూటర్ వ్యక్తి సుబ్బారావును లేపి క్షమించమని అడిగాడు. పది రూపాయలు చేతిలో పెట్టాడు.

"ప్చ.... మీది కారైతే ఎంత బావుండేదో కదా!" నిట్టూర్చాడు సుబ్బారావు.

—కె. రాధాకిషన్‌రావు (భువనగిరి)

**కాగితం** —శ్రీచంద్ర



"అదేమిటి? ఆదివారం హాయిగా గడపాలి కాని పనులేమిటి?"

"పరిస్థితి అలాగ వచ్చింది. చాలా అర్జంటయిన పని. క్షమించాలి– నాకు శల విప్వరూ?"

సుధ ముఖంలో చాలా నిరాశా బాధా ప్రతిఫలించాయి." ఈవేళ మీతో సరదాగా గడప వచ్చునని నేను చాలా ఆశించి సరదా పడ్డాను."

"కొంచెం అర్థం చేసుకోండి సుధా, ప్లీజ్." విధిలేక అన్నట్లందామె. "సరే. మీరంత ముఖ్యమైన పనంటూంటే నేనెలా వత్తిడి చేయగలను?"

"కృతజ్ఞతలు." అన్నాడు రాజేంద్ర లేస్తూ.

రఘురాం– అతనికి నమస్కరిస్తూ– "మళ్ళీ ఎప్పుడు మిమ్మల్ని ఆశించగలం?" అడిగాడు.

"అది– యిప్పుడు చెప్పలేను." వీలయినంత త్వరగా ఆ మాటలనేసి ఆక్కడి నుంచి బయటపడ్డాడు.

అప్పటికి కానీ అతను ఊపిరి పీల్చుకోలేక పోయాడు.

ఒక్కసారి జరిగినదంతా నెమరువేసుకుంటే

సుధ గురించి– తను పాతిక పుస్తకాలు కొన్నాడు. ఒక్కొక్కటీ ఐదు రూపాయలు తగ్గించి సెకండ్ హాండ్ స్టాల్ వాడికి అమ్మేవాడు. కనుక– పుస్తకాలలో నూట పాతిక రూపాయల నష్టం. మిగిలినది బట్టల గురించీ, సెంటు గురించీ.... ముప్పాతిక పై చిలుకే. ఎలా చూసుకున్నా– నెలకి కనీసం వంద. అందని అమ్మాయి కోసం నెలకి వంద రూపాయలు కాదుకదా వంద పైసలయితే మాత్రం ఎందుకు దండగ చెయ్యాలి?

తప్పు తనదే. పుస్తకాలనీ, పుస్తకాల అమ్మాయినీ నమ్మడమేమిటి? నిజానికి సుధ ఏం బాగుంది? ఇంటి దగ్గర అసలు రూపం బయటపడింది, ఏమీ అందంగా లేదు. అటువంటి మామూలు అమ్మాయి కోసం ఏమీ చెయ్యనక్కరలేదు, చెయ్యకూడదు కూడా.

దూరంగా– పారీస్ పోయేబస్ వస్తుంది. అతను నడక వేగం పెంచాడు. ✱




## కల్లోకి

"రాజా! నిన్న రాత్రి నువు నా కలలోకి వచ్చావు. మనిద్దరం ఎంచక్కా కబుర్లు చెప్పుకున్నాం. తెల్సా?" అంది రాధ.

"ఓహో.... నీ కలలోకి వచ్చాను కాబట్టే పాపం కమల కలలోకి రాలేదండి" చెప్పాడు రాజా.

–వి. ప్రకాష్ (చిత్తూరు)



సంక్రాంతి రథం  ముంగర పద్మ (రాపూరు)